# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 69 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 30 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 69 30-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




**రెస్టారెంట్లో భారీ అగ్ని ప్రమాదం**
**22 మంది మృతి** 3లో..

## యువతతోనే.. దేశ భవిష్యత్తు

### ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

దేశ భవిష్యత్తు కోసం యువతను సిద్ధం చేయడంలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ విద్యా వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ

- తరువాయి 2లో..

### అమరావతి పునఃప్రారంభ వేడుకకు రాజధాని రైతులకు


## చంద్రబాబు ఆహ్వానం

**అమరావతి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించి ముఖ్యమైన మలుపు మే 2వ తేదీన రానున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా రాజధాని పరిధిలోని గ్రామాల రైతులను ఆహ్వానించారు. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే రోజు అవుతుంది. ఇది నూతన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి


- తరువాయి 2లో..





## రాజ్యసభ సభ్యునిగా పాకా

**-ఎన్డీఏ తరపున పాకా సత్యనారాయణ నామినేషన్ -ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవం**



**అమరావతి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ నుండి రాజ్యసభ సభ్యునిగా బిజెపి సీనియర్ నేత పాకా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసీపీ సభ్యులు విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ గడువు ముగిసే సమయానికి పాకా ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమే. ఈ ఎన్నికను రిటర్నింగ్ అధికారి లాంచనంగా ప్రకటించాల్సి ఉంది. మంగళవారం నాడు భీమవరం నుండి పాకా సత్యనారాయణ విజయవాడలోని బిజెపి కార్యాలయానికి వచ్చారు. ఆయనకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే పార్థసారధి, ఇతర నేతలు శాలువాలతో

2లో..

### కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలు


## ఏడాది పొడిగింపు

**అమరావతి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కాంట్రాక్ట్ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది ఎపి ప్రభుత్వం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, జిల్లాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలు ఏడాదిపాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా కాలం ముగిసిపోగా.. వారి సేవలను 2026 ఏడాది మార్చి 30వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.. అయితే, ఆర్థిక శాఖ అనుమతితో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే సేవల పొడిగింపు వర్తిస్తుందని ఉత్తర్వులు జారీ చేశారు ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయుష్ కుమార్.. ఇక, కొత్తగా కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకానికి ఆర్థిక శాఖ ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం..

## ఏపీ ఈసెట్ పరీక్ష షెడ్యూల్ విడుదల

**అనంతపురం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



జేఎన్టీయూ అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్) %-% 2025 షెడ్యూల్‌ను ఇవాళ విడుదల చేశారు. ఈసెట్ పరీక్షను మే 6వ తేదీన నిర్వహించనున్నట్లు జేఎన్టీయూ అనంతపురం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు మీడియాకు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

- తరువాయి 2లో..

### ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదుల్ని..

## నిర్మూలించాల్సిందే..

### డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**మంగళగిరి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉగ్రదాడి ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసిందని.. పహల్గామ్ ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయని తెలిపారు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ .. షికారుకు వచ్చినట్లు వచ్చి పర్యాటకులను వేటాడారని.. ఐడీ కార్డులు అడిగి హిందువా, ముస్లింవా అని అడిగి మరీ అత్యంత క్రూరంగా అమాయకుల ప్రాణాలు తీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళు లర్పించే కార్యక్రమం మంగళవారం నాడు




- తరువాయి 2లో..

### పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ

## ధోనీలా తయారుకావాలి

### వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశం



- మిగతా 3 లో..

### ఏపీ మంత్రి కందుల దుర్గేష్‌కు

## అరుదైన గౌరవం

**రాజమహేంద్రవరం ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు అరుదైన గౌరవం లభించింది. వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుని అవశేషాల ప్రదర్శన కార్యక్రమ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు, మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగిస్తూ పీఎంవో మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వియత్నాం ప్రభుత్వ అభ్యర్థన

- తరువాయి 2లో..

### ఏపీ మెగా డీఎస్సీకి

## తాజా ఉత్తర్వులు

### అర్హత కటాఫ్ మార్కులు తగ్గింపు

**అమరావతి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ఉపాధ్యాయ నియామక ప్రక్రియ డీఎస్సీ (ఞూజ-2025) ప్రజలలో విశేషంగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 2025లో

- తరువాయి 2లో..




### మిస్ వరల్డ్ పోటీలపై


## సీఎం సమీక్ష

### ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు

**హైదరాబాద్ ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనేందుకు వస్తున్న పార్టిసిపెంట్స్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## నిప్పుల కొలిమి

భానుడి ఉగ్రరూపంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. అగ్నిగుండమవుతున్నది. ఉష్ణోగ్రతలు 45.5 డిగ్రీలు దాటాయి. మనుషుల మాడు పగిలేంత తీవ్రత కనిపిస్తున్నది. ఒకవైపు సూర్యుడి ప్రతాపం, మరోవైపు అకాలవర్షాలతో వింత వాతావరణం నెలకొంది. ఎండలు సాధారణ జనాన్ని భయపెడుతున్నాయి. ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తున్నాయి. గత రెండునెలల్లో వడదెబ్బతో దాదాపు 23 మంది చనిపోగా, గత బుధవారం ఏడుగురు, గురువారం నలుగురు మృతి చెందడం గమనార్హం. ఫిబ్రవరి నుంచే భానుడు భగభగ లాడుతున్నాడు. సాధారణం కన్నా ఎండవేడి విపరీతంగా పెరిగింది. 2022లో ఉష్ణోగ్రత 32 డిగ్రీలు ఉండగా, 2024 వచ్చేసరికి 45 డిగ్రీలకు పెరిగింది. ఈఏడాది అది కూడా 0.5డిగ్రీలు పెరిగి 45.5 డిగ్రీలకు చేరింది. దీనికి పర్యావరణంలో నిత్యం చోటు చేసుకుంటున్న విపరీతధోరణులే కారణం.

పసిఫిక్ మహాసముద్రంలో 'లా నినా'తో నీటి ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 'ఎల్ నినో'కు ఇది భిన్నం. లా నినా ప్రక్రియలో జాప్యం మూలంగా వచ్చే జూన్‌లో వర్షాలు సైతం ఆలస్యమయ్యే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాఖ అంచనా. లా నినా సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రత పెరుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో తగ్గుతుంది. సాధారణంగా తక్కువ వర్షపాతం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా తగ్గవచ్చు. ఇది పంటలపై ప్రభావం చూపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ పరిస్థితుల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే దిశగా చర్యలు తీసుకోవడంలో ఆయా సర్కారీ శాఖలు అప్రమత్తంగా ఉన్నట్టుగా కనిపించడం లేదు.

ఎండల సమస్య రాష్ట్రానిదేగాక, దేశంతోపాటు ప్రపంచానిది కూడా. అసలు ఎండలకు కారణమేంటో విస్తృత అధ్యయనం అవసరం. మూలాలను వెతికిపట్టుకోవాలి. ఇష్టారాజ్యంగా అడవుల నరికివేత, అభివృద్ధి పేర కుంటలు, చెరువుల పూడ్చివేత, కొండల తొల్చివేత పర్యావరణానికి ముప్పును తెస్తున్నాయి. ఈ పరిస్థితి మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చెట్ల నరికివేత, వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నేవీ రాడార్ కేంద్రం కోసం వేలాది చెట్లను అడ్డంగా తొలగిస్తున్న వైనం తెలిసిందే. ప్రకృతికి ఆలవాలం, దేశానికి వన్నె అయిన హిమాలయాల్లోనూ రోడ్లు, ఇతర సౌకర్యాల కోసం చెట్లను నిర్దాక్షిణ్యంగా పడేస్తున్నారు. ఇష్టా రీతిన వ్యవహరిస్తు న్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏడాదికోసారి మొక్కలు నాటడంతోనే సరి పోదు. పచ్చదనం పెంచే కార్యక్రమాలు విరివిగా జరగాలి. నిరంతర ప్రాధాన్యత, పర్యవేక్షణ ఉండా లి.ప్రభుత్వాలు అప్రమ త్తంగా ఉండి, పట్టించుకుంటేనే ప్రకృతి కరుణిస్తుంది. బీభత్సాలు జరగవు. తద్వారా జీవవైవిద్యానికి ప్రమాదముండదు.

కాగా ఎండల నేపథ్యంలో రుతుపవనాలు, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వానాకాలం పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ రైతులకు సలహా ఇస్తున్నది. ఎండాకాలంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. కాగా ప్రజల అవసరాలను నెరవేర్చడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మిన్నకుంటున్నాయి. గత రెండేండ్లతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో మరింత ఎక్కువగా వేడి నమోదయ్యే పరిస్థితులు ఉన్నాయనేది వాతావరణ శాఖ అవగాహన.ఇక భానుడి ప్రతాపానికి 'అమ్మో ఎండలు' అంటూ సాధారణ జనం ఇండ్ల నుంచి బయట కొచ్చేందుకు జంకుతున్నారు. నెత్తిమీద గొడుగు పెట్టుకుని, టోపీలు ధరించి అవసరమైతేనే రోడ్డుమీదకొస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండలు మోతమోగిస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నిప్పులకుంపటవుతున్నది. పట్టపగలే రోడ్లు నిర్మానుష్యమ వుతున్నాయి. జాగ్రత్తలు పాటించాలంటూ వాతావరణ శాఖ తరచూ హెచ్చరిస్తున్నది.

ఇదిలా ఉంటే, అకాలవర్షాలతో వరి, మొక్కజొన్న, మామిడి, మిర్చి తదితర పంటలు సుమారు లక్ష ఎకరాల్లో నష్టం జరిగింది. వడగండ్ల వాన, ఈదురుగాలులతో పంటలు దెబ్బతినడం, విద్యుత్ తీగలు తెగిపడటం జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.1100 కోట్ల మేర పంటనష్టం జరిగినట్టు సర్కారీ నివేదికలే చెబుతున్నాయి.

పరిహారంగా రైతులకు ఆహార ధాన్యపు పంటలకు ఎకరాకు రూ. 20 వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేలివ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కాగా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందన లేదు. తాగునీటి వసతుల్లేక వన్యప్రాణులు, మూగ జీవాల పరిస్థితి దారుణంగా మారింది. ఎండలు, ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. తీవ్రమైన ఎండలవేడితో ఉపాధి హామీతోపాటు సాధారణ రోజా కూలీలు, ఉద్యోగులు, వీధి వ్యాపారులు, పంచాయతీ, మున్సిపల్, నిర్మాణరంగ, కరెంటు తీగలమీద పనిచేసే కార్మికులతోపాటు ఇతరులూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అందుకే పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం కావాలి.

## యువతతోనే.. దేశ భవిష్యత్తు

శతాబ్దానికి అనుగుణంగా విద్య వ్యవస్థను అధునీకరించే దిశగా తమ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకొంటుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో వైయూజీఎం సదస్సులో ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ప్రపంచ విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దీనిని రూపొందించామన్నారు. ఈ విద్య విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత జాతీయ పాఠ్యాంశాల్లోనే కాకుండా.. అభ్యస, బోధనా విధానంలో పలు మార్పులు చూస్తున్నామని పేర్కొన్నారు. వన్ నేషన్ వన్ ఎడ్యుకేషన్ కింద ఏఐ (కృతిమ మేథ) అధారిత మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. దీనిని సైతం విస్తరించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని చెప్పారు. 21వ శతాబ్దపు డిమాండ్లను తీర్చడానికి దేశ విద్య వ్యవస్థను ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ క్రమంలో భవిష్యత్తులో ప్రతి సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమంగా మార్చడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా యువతకు ఆయన పిలుపునిచ్చారు. 2013-14లో పరిశోధనాభివృద్ధికి స్థూల వ్యయంలో కేవలం రూ. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, కానీ నేడు అది 1.25 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. టాలెంట్, టెంపర్‌మెంట్, టెక్నాలజీ అనే మూడు అంశాలు భారత్ భవిష్యత్తును మారుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. యువశక్తి ఆవిష్కరణలకు భారతీయ విశ్వవిద్యాలయాల ప్రాంగణాలు (క్యాంపస్) డైనమిక్ (గతి శీలక) కేంద్రాలుగా రూపొందుతాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమరావతి పునఃప్రారంభ వేడుకకు రాజధాని రైతులకు చంద్రబాబు ఆహ్వానం

యాత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలవనుంది, అని సీఎం ప్రకటించారు. చంద్రబాబు నాయుడు ఈ సందర్భంలో రాజధాని రైతుల త్యాగాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రైతుల యొక్క అసాధారణమైన సహకారమే నేడు ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి బలం ఇచ్చింది, అని ఆయన కొనియాడారు. రాజధాని గ్రామాల రైతులు తమ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా అందించడమే కాక, తమ భవిష్యత్తును అమరావతి భవిష్యత్తుతో అనుసంధానించారు. ఈ గొప్ప త్యాగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు, అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకం. రాజధాని నిర్మాణంలో జరుగుతున్న ప్రతి పనిలో మీరు భాగస్వాములై ఉండాలి, అని రైతులను పిలుపునిచ్చారు.

### రైతులకు ప్రత్యేక హామీలు

సోమవారం రోజు ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం చంద్రబాబు రాజధాని పరిధిలోని వివిధ గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై రైతులతో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇచ్చిన రైతులకు కేటాయించే ప్లాట్లపై చర్చ సాగింది. ల్యాండ్ పూలింగ్‌లో రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం తిరిగి కేటాయించే ప్లాట్లకు బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

## రాజ్యసభ సభ్యునిగా పాకా

సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం అక్కడి నుండి అసెంబ్లీకి చేరుకుని పాకా సత్యనారాయణ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పాకా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాకాను చంద్రబాబు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పాకా సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తాను బీజేపీలో పని చేస్తున్నానని, బీజేపీ పట్టణ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర నేతగా ఎదిగానని తెలిపారు. డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా, కేంద్ర మంత్రుల బృందానికి కన్వీనర్‌గా, క్రమశిక్షణ సంఘం కమిటీ ఛైర్మన్‌గా పని చేశానని అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి బీజేపీలో ప్రాధాన్యత, పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు వస్తుందనేందుకు తన రాజ్యసభ ఎంపికే నిదర్శనమని పాకా అన్నారు. రాష్ట్ర నేతలు అందరూ తన పేరు సూచించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానని అన్నారు. ఏపీలో బీజేపీ బలోపేతం చేస్తూ కూటమి లక్ష్యాలను ముందుకు తీసుకెళతానన్నారు. అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకునేలా కలిసి పని చేస్తామని, దేశ హితం, రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి ప్రయాణిస్తామని స్పష్టం చేశారు. మోదీ నేతృత్వంలో జరిగే అభివృద్ధిలో తనకు భాగస్వామ్యం కలగడం ఆనందంగా ఉందన్నారు. మోదీ, అమిత్ షా, నడ్డాలతో కలిసి పనిచేసే అవకాశం రావడం మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. వివాదాస్పద చట్టాలు పక్కన పెట్టి మోదీ తీసుకునే నిర్ణయాలు ఆదర్శంగా ఉన్నాయని పాకా పేర్కొన్నారు.

### మేం సమకాలీకులం: శ్రీనివాస వర్మ

పాకా సత్యనారాయణ మొట్టమొదటి నుంచీ బీజేపీ కోసం పని చేశారని, ఆయన సేవలు గుర్తించి రాజ్యసభకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పార్టీని నమ్ముకుని పని చేసిన వ్యక్తికి సముచిత స్థానం దక్కిందని అన్నారు. తాను, ఆయన భీమవరం రోడ్లపై ఒకే బండి మీద తిరిగామని, 35 సంవత్సరాలుగా మేము కలిసి పని చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు ఢిల్లీలో కూడా మేమిద్దరం రాష్ట్రం కోసం కలిసి పని చేస్తామని అన్నారు. కార్యకర్తల సేవలను గుర్తించి ఇటీవల పార్టీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుందని, తాను, పాకా సత్యనారాయణ, సోము వీర్రాజు, సత్యకుమార్ సమకాలీకులమని తెలిపారు. మేమంతా కలిసిపని చేశామని, ఇప్పుడు కలిసి పదవుల ద్వారా అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యామన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని శ్రీనివాస వర్మ అన్నారు.

### పాకా మంచి పనిమంతుడు: సోము వీర్రాజు

పాకా సత్యనారాయణ మంచి పనిమంతుడని, టీడీపీలో పదవి వచ్చే అవకాశం ఉన్నా ఆ పార్టీలోకి వెళ్ల లేదని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ కోసం కమిట్ మెంట్ తో పని చేశారని తాను అధ్యక్షుడుగా ఉన్న సమయంలో అనేక బాధ్యతలు అప్పగించామని చెప్పారు. పార్టీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ గా నియమించానని, ఎటువంటి బాధ్యత ఇచ్చినా కాదనకుండా సమర్ధవంతంగా పని చేసేవారని అన్నారు. ఇప్పుడు రాజ్యసభ సభ్యుడిగా ఆయన సేవలకు గుర్తింపు లభించిందన్నారు. బీజేపీ అధిష్టానం పని చేసే వారిని తప్పకుండా గుర్తిస్తుందని, పాకాకు రాజ్యసభ బాధ్యత ఇచ్చినందుకు అధిష్టానానికి తన ధన్యవాదాలు అని తెలిపారు. ఇప్పుడు ఆయన పని తీరు, సేవలు దేశం కూడా గుర్తిస్తుందని సోము వీర్రాజు అన్నారు.

## ఏపీ ఈసెట్ పరీక్ష షెడ్యూల్ విడుదల

మే 6వ తేదీన రెండు సెషన్లలో ఈసెట్ పరీక్ష జరుగుతుందని వీసీ వివరించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో విడత పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,187 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారి కోసం 110 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో కూడా ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని వీసీ సుదర్శనరావు సూచించారు. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు గంటన్నర ముందుగానే తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష హాలులోకి క్యాలిక్యులేటర్లు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు వంటి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని ఆయన తేల్చి చెప్పారు.

## ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదుల్ని.. నిర్మూలించాల్సిందే..

మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో నిర్వహించారు..ఈ సంతాప సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , మంత్రి నాదెండ్ల మనోహర్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు నేతలు మౌనం పాటించారు. ఉగ్రదాడి మృతులకు డిప్యూటీ సీఎం నివాళులు అర్పించారు.

### దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం వచ్చింది.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అమాయకులను అత్యంత దారుణంగా చంపారన్నారు. సరిహద్దు భద్రత అత్యంత అవసరమన్నారు. నిరాయుధులతో యుద్ధం చేయకూడదని తెలిపారు. ఎంతో నమ్మకంతోనే కశ్మీర్ పర్యటనకు వెళ్లారన్నారు. కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నంత వరకు ప్రశాంతంగా ఉందని.. అధికారం రాష్ట్రం చేతిలోకి వెళ్లగానే ఇలాంటి ఘటన జరిగిందన్నారు. ఉగ్రవాదులపై కనికరం అవసరం లేదన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు.
లక్షలాదిమంది కశ్మీరీ పండిట్లు వలస వెళ్లిపోయారని తెలిపారు. అప్పటి నుంచి కశ్మీర్ మండుతూనే ఉందన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమే.. ఎప్పటికీ అంతే అని స్పష్టం చేశారు. భారత్‌లో ఉండి పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్‌పై ప్రేమ ఉన్నవారు ఆ దేశం వెళ్లిపోవచ్చని అన్నారు. మతం అడిగి చంపేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతుంటే నమ్మరెందుకని ప్రశ్నించారు.

### హిందువులకు ఉన్నది ఒక్కదేశమే .. అది భారత్

అతి మంచితనం కూడా మంచిది కాదని అభిప్రాయపడ్డారు. కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోవాలా.. అతి సహనం కూడా ప్రమాదకరమన్నారు. పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించామని గుర్తుచేశారు. జనసేన ఉన్నది తెలుగు రాష్ట్రాల్లోనే.. కానీ మాది జాతీయ విధానమని తేల్చి చెప్పారు. ఉగ్రవాదులను ఎదుర్కోవాలంటే ధైర్యంతో కూడుకున్న పని అని అన్నారు. హిందువులకు ఉన్నది ఒక్కటే దేశమని ఇక్కడ కూడా హిందువులనే టార్గెట్ చేస్తే ఎక్కడికి పోవాలని అన్నారు. హత్య చేసి మోదీకి చెప్పుకోండి అన్నారని పర్యాటకులు చెబుతున్నారని తెలిపారు.

### మధుసూధన్ కు రూ రూ.50లక్షల పరిహారం

ఉగ్రదాడిలో చనిపోయిన కావలికి చెందిన మధుసూదన్ కుటుంబానికి పరిహారం ప్రకటించారు పవన్. జనసేన పక్షాన మదుసూదన్ కుటుంబానికి యాభై లక్షలను ప్రకటించారు. అతని కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 'మనం ఏదొక రూపంలో ప్రాణాలు కోల్పోతాం. అది దేశంకోసం అయితే మన మరణానికి ఒక అర్థం ఉంటుంది. మదుసూదన్ కుటుంబం ఆ పరిస్థితి నుంచి బయటకు రావడం చాలా కష్టం. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారందరికి జనసేన పక్షాన నివాళి అర్పిస్తున్నాం' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## ఏపీ మంత్రి కందుల దుర్గేష్‌కు అరుదైన గౌరవం

మేరకు భారత ప్రభుత్వం బుద్ధుడి పవిత్ర అస్థికలు, అవశేషాలను బౌద్ధమత అనుచరుల సందర్శనార్థం వియత్నాంలోని హో చి మిన్హ్ నగరంలో ప్రదర్శించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో దేశంలోని బుద్ధుడి పవిత్ర అవశేషాలను (కపిల్వాస్తు అవశేషాలు) పటిష్ట భద్రత నడుమ భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్-ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎయిర్ క్రాఫ్ట్) చెందిన ప్రత్యేక హెర్క్యులస్ ఎయిర్ క్రాఫ్ట్‌లో కేంద్రం పంపించనుంది. బౌద్ధ మత అనుచరులు ఎంతో పవిత్రంగా భావించే బుద్ధ భగవానుడి అవశేషాలను మే1న న్యూఢిల్లీ నుంచి వియత్నాంలో ప్రదర్శనకు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 6 వరకు వియత్నాంలో ప్రదర్శన జరుగనుంది. ఈ ప్రదర్శనలో బుద్ధ భగవానుడి అవశేషాలను ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శన పూర్తి అయిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ తిరిగి రాష్ట్రానికి తిరిగి రానున్నారు. ఈ ప్రదర్శనతో వియత్నాం, భారతదేశ బౌద్ధ సమాజాలు, ప్రజల మధ్య దీర్ఘకాలిక, స్నేహపూర్వక సంబంధాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. వియాత్నం వెళ్లేందుకు ఏప్రిల్ 30న మంత్రి కందుల దుర్గేష్ న్యూఢిల్లీ చేరుకోనున్నారు. మంత్రి కందుల దుర్గేష్‌కు లభించిన ప్రత్యేక గౌరవంపై ప్రభుత్వం నుంచి, ప్రజల నుంచి ప్రశంసల వెల్లువెత్తుతున్నాయి. తనకు లభించిన అవకాశంపై మంత్రి దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## ఏపీ మెగా డీఎస్సీకి తాజా ఉత్తర్వులు

### అర్హత కటాఫ్ మార్కులు తగ్గింపు

నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ డీఎస్సీ ప్రక్రియలో భాగంగా కొన్ని సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థుల కోసం ముఖ్యమైన సడలింపులను ప్రభుత్వం ప్రకటించింది.

కొత్త అర్హత ప్రమాణాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజా ఉత్తర్వుల ప్రకారం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి కనీసం డిగ్రీలో 40% మార్కులు ఉంటే చాలు అనే వెసులుబాటు కల్పించింది. ఇప్పటివరకు డీఎస్సీ కోసం డిగ్రీలో 45% మార్కులు అవసరమయ్యేవి. అయితే, టెట్, దీ.జుఽ కోర్సులకు ఇప్పటికే 40% మార్కులతో అర్హత ఉంటుంది. అదే ప్రమాణాన్ని డీఎస్సీకి కూడా వర్తింపజేయాలన్న అభ్యర్థుల నిరసనలు, విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, జనరల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులకు మాత్రం ఈ సడలింపు వర్తించదు. వారికి తప్పనిసరిగా డిగ్రీలో కనీసం 50% మార్కులు ఉండాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ముఖ్యమైన తేదీలు:

ఏప్రిల్ 20 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల చెల్లింపు మే 15 వరకు కొనసాగనుంది. అలాగే మే 30 నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జులై 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే డీఎస్సీ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తేల్చి చెప్పింది. కాగా, ఏపీ డీఎస్సీ-2025కి సంబంధించిన పూర్తి వివరాలు అభ్యర్థులు పూర్తి వివరాలు, సిలబస్, జిల్లాల వారీ ఖాళీల వివరాలు, అర్హత ప్రమాణాలు, సిబిటి మోడల్ పరీక్షల వివరాలను అధికారిక వెబ్‌సైట్ ష్ట్రజూం://ఘజూఎంఎ.ఘజూఎటంం.ఱఅ/ లో తెలుసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో బోధనలో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో, ఈ మెగా డీఎస్సీకి పెద్ద ఎత్తున అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు.

## మిస్ వరల్డ్ పోటీలపై సీఎం సమీక్ష

రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందులోభాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై మంగళవారం నాడు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ పోటీలకు వచ్చే అతిథులు తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. దేశ, విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభవన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# రెస్టారెంట్లో భారీ అగ్ని ప్రమాదం

## 22 మంది మృతి



**బీజింగ్, ఏప్రిల్ 29: తెలుగురాష్ట్రం**

చైనాలోని లియానింగ్ ప్రావిన్స్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్లో మంటలు చెలరేగటంతో 22 మంది చనిపోగా .. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఈ దారుణ సంఘటన చోటుచేసుకుంది. చైనా అధికార మీడియా క్లిన్‌క్షువ న్యూస్ తెలిపిన వివరాల మేరకు.. చైనా, లియానింగ్ ప్రావిన్స్‌లోని ఐయావోయాంగ్ సిటీలో ఓ ప్రముఖ రెస్టారెంట్ ఉంది. మంగళవారం మధ్యాహ్నం 12.25 గంటల ప్రాంతంలో ఆ రెస్టారెంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 22 మంది చనిపోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. అగ్ని మాపక దళంతో పాటు రెస్క్యూ టీమ్‌కు కూడా సమాచారం వెళ్లింది. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ టీమ్ సిబ్బంది గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. అగ్ని మాపక దళాలు మంటల్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశాయి. పోలీసులు చనిపోయిన 22 మంది మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంపారు. ఇక, ఈ సంఘటనపై చైనా అధ్యక్షుడు క్షి జిన్‌పింగ్ స్పందించారు. గాయపడ్డవారికి సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయితే, రెస్టారెంట్లో మంటలు చెలరేగడానికి కారణం ఏంటన్నది తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కానిస్టేబుల్ టు ఐపీఎస్ -ఉదయ కృష్ణారెడ్డిపై

# సీఎం చంద్రబాబు ప్రశంసలు





**అమరావతి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కానిస్టేబుల్ ఉదయ కృష్ణారెడ్డి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆల్ ఇండియా 350 ర్యాంక్ సాధించిన సంగతి తెలిసిందే. ఆయన ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఉదయ కృష్ణారెడ్డి సక్సెస్ స్టోరీపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఉదయ కృష్ణారెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించారు. 'కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌గా ఎదిగిన ఉదయ కృష్ణారెడ్డి ప్రయాణం.. ధైర్యం, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది. సాధించాలనే పట్టుదల ప్రతీ అడ్డంకిని బద్దలు కొడుతుంది. కొత్త చరిత్రను రాస్తుంది. భవిష్యత్తు పట్టు వదలకుండా పని చేసే వారిదే ' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ధోనీలా తయారుకావాలి: జగన్

**వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశం**

**పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రధాన చర్చ - ప్రతిపక్షంలో చురుకైన పాత్ర పోషించాలని నేతలకు పిలుపు**



**తాడేపల్లి, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైసీపీ అధినేత జగన్ పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈరోజు పార్టీ జిల్లా అధ్యక్షులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతిపక్షంగా సమర్థవంతంగా పని చేయాల్సిన తీరుపై ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నాయకుల్లో ఉండే నిజమైన నాయకత్వ ప్రతిభ బయటపడుతుందని అన్నారు. "భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ ఏంటో తెలుస్తుంది. అప్పుడే అతడు ప్రజలకు ఇష్టమైన ఆటగాడు అవుతాడు. రాజకీయాల్లో కూడా ఇది అంతే. ప్రతిపక్షంలో మనం చేసే పనుల ద్వారానే మనల్ని మనం నిరూపించుకుంటాం. ప్రజల్లో, పార్టీలో గౌరవం, ఇమేజ్ పెరుగుతాయి. మన పనితీరుతోనే మన్ననలు పొందగలుగుతాం. అందరూ ధోనీలా తయారు కావాలి" అని చెప్పారు. జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం స్పందించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా అధ్యక్షులకు జగన్ పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలని, పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలని స్పష్టం చేశారు. "మనం రాజకీయ నాయకులం. మన జీవితాలను రాజకీయాలకే అంకితం చేశామన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు. ప్రతిపక్షంగా మనకు లభించిన అవకాశాలను వృథా చేసుకోకూడదు" అని సూచించారు.



జిల్లా స్థాయిలో ప్రజా సంబంధిత అంశాలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకొస్తేనే ప్రజలకు మరింత చేరువ కాగలమని జగన్ అన్నారు. తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మరింత మంచి చేయగలమని, ఆ తపనతోనే రాజకీయాలు చేస్తున్నామని తెలిపారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ప్రతి ఇంట్లో తన ఫోటో ఉండాలనుకున్నానని, అదే స్ఫూర్తితో జిల్లా అధ్యక్షులు కూడా తమ సేవలతో ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. పార్టీ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులకు సూచించారు.

# నేడు తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు...

# ఈసారి చాలా స్పెషల్

**మధ్యాహ్నం 1 గంటకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి విడుదల**

**మార్చి 21 - ఏప్రిల్ 4 వరకు జరిగిన పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరు**

**ఈసారి మార్కుల మెమోలో గ్రేడ్‌లతో పాటు సబ్జెక్టుల వారీగా మార్కులు**

**కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌కు కూడా గ్రేడ్‌లు కేటాయింపు**



**హైదరాబాద్ ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష ఫలితాలు రేపు (బుధవారం) విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది.

తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు సుమారు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడం, నూతన విధానంలో మార్కుల మెమోల జారీపై స్పష్టత రావడంతో ఫలితాల విడుదలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**మార్కుల మెమోలో మార్పులు**

ఈ సంవత్సరం నుంచి పదో తరగతి మార్కుల మెమోల విధానంలో ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన మార్పులు చేసింది. గతంలో కేవలం సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు, సీజీపీఏ మాత్రమే ఇచ్చేవారు. అయితే, ఇక నుంచి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ మార్కులను విడివిడిగా చూపించడంతో పాటు, మొత్తం మార్కులు, గ్రేడ్‌లను కూడా మెమోలో పొందుపరచనున్నారు. అలాగే, విద్యార్థి ఉత్తీర్ణత (పాస్/ఫెయిల్) వివరాలను కూడా స్పష్టంగా పేర్కొంటారు. బోధనేతర కార్యక్రమాల్లో (కో-కరిక్యులర్ యాక్టివిటీస్) విద్యార్థుల ప్రతిభకు కూడా గ్రేడ్లు ఇవ్వనున్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ వంటి నాలుగు విభాగాలకు సంబంధించిన గ్రేడ్లను కూడా మార్కుల మెమోలో ముద్రించనున్నట్లు అధికారులు తెలిపారు.

# అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురు కాల్పులు



**కొయ్యూరు:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. యు.చీడిపాలెం పంచాయతీ పరిధి కాకుల మామిడి, కంటారం సమీపంలో రెండు చోట్ల మావోయిస్టు కదలికలను గమనించిన బలగాలు కాల్పులు జరగపగా.. మావోయిస్టులు ఎదురుదాడికి దిగారు. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మరోవైపు ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. మరిన్ని బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుంటున్నాయి. ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్ట అడవుల్లో నిర్బంధం పెరగడంతో అక్కడి నుంచి మావోయిస్టులు తప్పించుకొని జిల్లాలోకి ప్రవేశించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

**గుత్తి:**

అనంతపురం జిల్లా గుత్తి వద్ద నిజామాబాద్-తిరుపతి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో చోరీ జరిగింది. ఆగి ఉన్న రైలులోకి ఐదుగురు దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులకు చెందిన బంగారం, నగదుతో పాటు విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు లైన్‌క్లియర్ చేసేందుకు గుత్తి శివారులో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపారు. ఈ సమయంలోనే దుండగులు ఆ రైలులోకి 10 బోగీల్లో దోపిడీకి పాల్పడ్డారు. దీనిపై 20 మంది బాధితులు తిరుపతి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# అమరావతిలో ప్రధాని పర్యటనకు

# 90 శాతం ఏర్పాట్లు పూర్తి

## మంత్రి నారాయణ



**అమరావతి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. మిగిలిన పనులను రేపటికి పూర్తిచేస్తామని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.**

"రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లే ఔట్ రోడ్లు నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే రూ.41 వేలకోట్లకు పనులు ప్రారంభమయ్యాయి. 2019కు ముందు రూ.5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. సోమవారం అమరావతి ప్రాంత రైతులతో సీఎం రెండుగంటలపాటు మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు" అని నారాయణ తెలిపారు.




## ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో విద్యాధికారుల సమావేశం

**సఖినేటిపల్లి ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎంపిపి వీరా మల్లికార్జున రావు అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారులు డి. కిషోర్ కుమార్,యం.వేంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు/ప్రిన్సిపాల్ లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద అత్యవసర సమావేశం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ఉచిత అడ్మిషన్లు రిజిస్ట్రేషన్లు,సెలవుల్లో స్కూల్ బస్సులు మరమత్తులు, మౌలిక సదుపాయాలు త్రాగు నీరు,రన్నింగ్ వాటర్,బాత్రూం గదులు, పలు సౌకర్యాలు ఉండేటట్లు చూడాలని స్కూల్ అంశాలపై ఈ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వై.వెంకటేశ్వర రావు,ప్రైవేట్ స్కూల్ యూనియన్ ప్రెసిడెంట్ దివ్వి నాయుడు,పి.సూరి బాబు పాల్గొన్నారు.

## చిట్టబ్బాయికి ఘన నివాళి



**అమలాపురం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం మాజీ శాసనసభ్యులు, వైసిపి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు కుడిపూడి చిట్టబ్బాయి నాలుగో వర్ధంతి కార్యక్రమం అమలాపురం హైస్కూల్ సెంటర్ వద్ద నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటరులో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆయన కుటుంబ సభ్యులు ర్యాలీగా వచ్చి చిట్టబ్బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి అన్ని వర్గాల మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి చిట్టబ్బాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ శాసన సభ్యురాలు పాముల రాజేశ్వరి దేవి, రెడ్డి సత్య నాగేంద్ర మణి, చిట్టబ్బాయి కుమారుడు భరత్ భూషణ్, కోడలు శైలజ, వైసిపి నాయకులు పీకే రావు, కుడిపూడి భాగ్యలక్ష్మి, నల్లా విష్ణు, ఒంటెద్దు వెంకన్న నాయుడు, మోటూరి సత్యం, కుంచె రమణారావు, ఇళ్ల శేషారావు, పందిరి శ్రీహరి, గుత్తుల చిరంజీవి, కేత భాను తేజ, కర్రి రాఘవులు, గుత్తుల రాజు, మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, విత్తనాల శేఖర్, వాసంశెట్టి పెదబాబు, కాంద్రేకుల గోపి, మట్టపర్తి సత్యమోహన్, రాయుడు షణ్ముఖ, చింత రామకృష్ణ, జక్కంపూడి కిరణ్, కోడూరి దుర్గాప్రసాద్, పందిరి సుబ్బరాజు, పుత్రేవు చందు, పోలమూరి ప్రవీణ్, నూలు రమేష్, కోరుమిల్లి అనంత్, విత్తనాల మూర్తి, కముజు రమణ, దొమ్మేటి జయరాం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి 20వేలు ఆర్థిక సహాయం



**మలికిపురం ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మలికిపురం మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన తాడి భవాని ఇంటి నిర్మాణానికి సమాకూర్చిన 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని తాడి వారి సంక్షేమ సంఘము తరుపున అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఆర్థికంగా సహాయం చేసిన తాడి శ్రీనివాస్,తాడి రత్నరాజు,తాడి సువర్ణ రాజు,గంటా విద్యా సాగర్ లకు తాడి వారి సంక్షేమ సంఘం తరుపున హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు.ఈ సందర్భంగా సంఘము నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఈ సంస్థను ప్రారంభించామని ఈ సంస్థ ద్వారా అనేక మందికి ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉంటూ, స్థానికంగా ఉన్న సభ్యులు సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.47 కోట్లు



**ఆత్రేయపురం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి భారీగా హుండీ ఆదాయం లభించింది. సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించగా 32 రోజులకు రూ.1.47 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.1,19,16,439, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.24,51,230 నగదుతో పాటు 13 గ్రాముల బంగారం,1 కేజీ 380 గ్రాముల వెండి, 64 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని డీసీ చక్రధరరావు తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల నుంచి రూ.3,45,300 ఆదాయం లభించింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ రాజమండ్రి తనిఖీదారు టి.వి.ఎస్.ఆర్.ప్రసాద్, గోపాలపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి.కిరణ్, ఆత్రేయపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి. నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, ఉప సర్పంచ్ పోచిరాజు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### 99 పైసలకే ఎకరం భూమి ఇచ్చిన

## చంద్రబాబుని పిచ్చాసుపత్రిలో చేర్చాలి

**వైసీపీ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి - మంత్రి సుభాష్ విమర్శలకు కౌంటర్**




**రావులపాలెం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గతంలో జగన్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులకే కూటమి ప్రభుత్వం మళ్ళీ ప్రారంభోత్సవాలు చేస్తుండడం, గతంలో ప్రధాని మోడీ చేతుల మీదుగా శంఖుస్థాపన చేయించిన అమరావతి పనులకు మళ్ళీ శంఖుస్థాపన చేయించాలని ఏర్పాట్లు చేస్తుండడం విడ్డూరంగా ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ప్రభుత్వ తీరు యమలీల సినిమాలో చెల్లికి పెళ్ళి కావాలి మళ్ళీ మళ్ళీ అనే డైలాగును గుర్తు చేస్తుందని ఎద్దేవా చేసారు. రావులపాలెం వైసీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాలెం మండలం గోపాలపురంలో జగన్ పై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. విశాఖపట్నంలో ఉర్సా సంస్థకు కూటమి ప్రభుత్వం 99 పైసలకే ఎకరం భూమిని అప్పగించడం చూస్తే చంద్రబాబుకు మతి భ్రమించిందని భావిస్తున్నామని వెంటనే ఆయనను విశాఖపట్నం మెంటల్ ఆసుపత్రిలో చికిత్స అందించాలని హితవు పలికారు. ఎకరం కనీసం రూ.4 కోట్లు పైన పలికే వైజాగ్ భూములను 99 పైసలకే ఉర్సా కంపెనీకి కట్టబెట్టిన చంద్రబాబు మానసిక స్థితి ఏంటో వాసంసెట్టి సుభాష్ చెప్పాలని ఎద్దేవా చేసారు.జగన్ విమర్శలను తీసుకోలేరని అందుకే అసెంబ్లీకి రావడం లేదని అంటున్న మంత్రి సుభాష్ కు తాము కూడా సద్విమర్శ చేస్తున్నామని, బీసీలకు 50 ఏళ్ళకే పెన్షన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఎప్పటి నుంచి ఇస్తారో క్యాబినెట్లో ఆయన పక్కన కూర్చునే మీరు అడిగి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మార్గన గంగాధర్, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, మండల పార్టీ అధ్యక్షులు దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీనివాస్, జవ్వాది రవిబాబు, కర్రి నాగిరెడ్డి, కర్రి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 216 జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదం

**చికిత్స పొందుతూ యువకుడు మృతి**

**ఐ.పోలవరం ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ గ్రామం అన్నంపల్లి టోల్ గేట్ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. అమలాపురం నుండి వస్తున్న టిప్పర్ లారీ, మురమళ్ళ నుండి వస్తున్న పల్సర్ బైక్ ఢీ కొట్టడంతో బైక్ పై ఉన్న నలుగురిలో ఒకరు పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఒకరికి స్వల్ప గాయాలు. క్షతగాత్రులను 108 లో ముందుగా ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి, తరువాత అమలాపురం కిమ్స్ కి తరలించారు. ఐ పోలవరం మండలం టీ.కొత్తపల్లి గ్రామం పండు వారి పేటకు చెందిన ఉందుర్తి బాలు, బి వినోద్, గొల్లపాలెం గ్రామానికి చెందిన ఖండవల్లి రాజు, అయినవిల్లి మండలం శంకరయ్య గూడ కి చెందిన నిడుమూరు ఉమామహేశ్వరరావు యానం నుండి ఒకే మోటార్ సైకిల్ పై వస్తు, ఉమామహేశ్వరరావు ఇంటి వద్ద దింపేందుకు వారు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నలుగురిలో ఒక యువకుడు ఉందుర్తి బాల బాలాజీ (22) రాత్రి మృతి చెందాడు. మిగతా ముగ్గురు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను

## వెంటనే నిలుపుదల చేయ్యాలి

**రాజోలు మండల జేఏసీ**

**రాజోలు, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎస్సీ వర్గీకరణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ ను వెంటనే నిలుపుదల చేయ్యాలని రాజోలు మండల మాలల న్యాయ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు పట్టణంలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక భవనంలో మండల జేఏసీ అధ్యక్షులు మట్టా సురేష్ కుమార్ అధ్యక్షతన సోమవారం మాలల న్యాయపోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నున్న అన్నీ రాజకీయ పార్టీలు మాలల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంభిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం మాలలకు తీవ్ర అన్యాయం చేసే చర్యలు చేపట్టడంపై జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయ పార్టీలకు అతీతంగా ఎస్సీ వర్గీకరణ కు వ్యతిరేకంగా మాలలందరూ ఉద్యమించాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల జేఏసీ ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజి,ఉపాధ్యక్షులు మందపాటి మధు, వైస్ ఎంపీపీ పొలుమూరి శ్యాంబాబు,విప్పర్తి సాయిబాబు,బత్తుల మురళీకృష్ణ,కొల్లాబత్తుల సతీష్,చిలకపాటి శ్రీధర్,జిల్లెళ్ళ వినోద్ బాబు,బొడ్డపల్లి పుల్లయ్య,చింతా శ్రీనివాస్,రావి విజయ్,మెడబల శేఖర్,పొన్నమాటి భాస్కర్,బుంగ శ్రీను,బొడ్డపల్లి ప్రసాద్,కలిగితి త్రిమూర్తులు,గెడ్డం జోషి,నల్లి నాగబాబు,పెయ్యాల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ కార్యదర్శిగా సాయిరామ్ సేవలు ఎనలేనివి



**రావులపాలెం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గ్రామ కార్యదర్శిగా నిమ్మకాయల సాయిరామ్ వివిధ గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసారని పలువురు కొనియాడారు. రావులపాలెం మండలం గోపాలపురం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న నిమ్మకాయల సాయిరామ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయిరామ్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో గంగుల కృష్ణ, సర్పంచులు సబ్బితి మోహనరావు, కర్రి గోవింద కృష్ణారెడ్డి, బొక్కా కరుణాకరం, కార్యదర్శులు ఎల్. దుర్గాప్రసాద్, మూర్తి, శర్మ, పట్టాభి రామయ్య, సుభాకర్, శరభరాజు, కొక్కిరిగడ్డ నరసింహమూర్తి, దిడ్ల కిషోర్, వ్యవసాయాధికారి బి.మీనా తదితరులు పాల్గొన్నారు.

### నడిమిలంకలో కుట్టు మిషన్ శిక్షణ

## సెంటర్ ప్రారంభోత్సవం

**ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు**

**ముమ్మిడివరం ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి నడిమి లంకలో కుట్టు మిషన్ శిక్షణ సెంటర్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్ శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు భారీగా తరలివచ్చి ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా మహిళలను అభివృద్ధి పదంలోకి తీసుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వానికి ముమ్మిడివరం నియోజకవర్గానికి 10 కుట్టు మిషన్ సెంటర్లను తీసుకువచ్చిన బుచ్చిబాబు ని మహిళలు సాలువ కప్పి పుష్పగుచ్చాలతో అభినందించారు. బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరిగిందని అలాగే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో ప్రతి పథకం అమలు జరగడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళలు స్కిల్ డెవలప్మెంట్ ఇస్తున్న శిక్షణను నేర్చుకొని కుటుంబాన్ని పోషించటానికి ప్రభుత్వం చేస్తున్న ఈ పథకానికి ప్రతి ఒక్కరూ సహకరించి ముందుకు వెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకి ఎన్నో అభివృద్ధి పథకాలు తీసుకువస్తున్నారని ప్రతి మహిళ ఇచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని , స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా ఈ ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి డిజైనింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి మహిళలు సొంతంగా డిజైనింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేస్తుందని బుచ్చిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, రాష్ట్ర మత్స్యకార డైరెక్టర్ నాగిడి నాగేశ్వరరావు, మాజీ మార్కెటింగ్ చైర్మన్ గొల్ల కోటి దొరబాబు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు, దొమ్మేటి రమణ కుమార్, పొద్దోకు నారాయణరావు, సాగిరాజు సూరిబాబురాజు, ములపర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి, కడలి నాగు, అడబాల సతీష్ కుమార్, కట్ట సత్తిబాబు, మాదాల బుజ్జి , దివి మహాలక్ష్మి, యాళ్ల ఉదయ్, మెండి కమల, బొక్క రుక్మిణి, కుడిపూడి మల్లేశ్వరి, కాశి రామచంద్రరావు, గోరింట శ్రీను రాజు, సరిపెల్ల శ్రీను రాజు, కాశి లాజర్, నీతిపూడి వంశి, గోదాసి గణేష్, నిమ్మకాయల విష్, జగత గోవిందరావు, కుంచె శ్రీను, బూరుగు కళ్యాణ్, చంటి, మరియు అధికారులు కాన్సిస్టెన్సీ కోఆర్డినేటర్ కె గంగాధర్, ఎన్ నరసింహమూర్తి, వార్డు వెల్ఫేర్ సెక్రెటరీ పల్లెపాలెం సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన తరగతులు

**మలికిపురం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మలికిపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బి నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిరి. యూపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అడబాల వీర వెంకట సత్యనారాయణ మూర్తి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల అలంకరించరి.వీరి ప్రసంగాలలో విజ్ఞాన తరగతులను ఉపయోగించుకోవాలని అలాగే గ్రంథాలయములోని పుస్తకములను చదివి ఉన్నతులుగా ఎదగాలని కోరుట జరిగినది.ఈ యొక్క కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ రహీం.ఎం సాంబశివరావు,ఎన్ విజయబాబు,జె రక్షక కుమార్ సిహెచ్ కళ్యాణి,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## పెదపాడు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

ఏలూరు, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పెదపాడు శాఖా గ్రంథాలయం నందు వేసవి సెలవుల్లో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరంలోని కార్యక్రమం రెండో రోజు మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ పూడి రవికుమార్ చే స్పోకెన్ ఇంగ్లీష్ చెప్పి, దానిలోని మెలుకువలు నేర్పించడం జరిగినది. తదుపరి విద్యార్థులచే కథలు చదివించడం, కథలు చెప్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 26 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనినారు,ఈ కార్యక్రమం అంతయు గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో జరిగినది. పాల్గొనిన విద్యార్థినీ విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు.

## ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏపీ ఎంసీప ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె






ఏలూరు, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు స్థానిక కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ నిరవధిక సమ్మెలో తమ ప్రధాన డిమాండ్లుగా ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23% వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ ను పునరుద్ధరించాలని, క్లినిక్ బకాయిలను వెంటనే చెల్లించి, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్ఫర్స్,ఎక్స్గ్రేషియా పితృత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించేవరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని తెలియజేశారు.

## కోహినూర్ గోల్డ్ అండ్ డైమండ్స్ నూతన ప్రారంభోత్సవం



ఏలూరు, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు స్థానిక విజయ విహార్ సెంటర్ లో కోహినూర్ గోల్డ్ అండ్ డైమండ్స్ నూతన వ్యాపారాన్ని ఎస్.ఎమ్ అక్బర్, కె. మొహిద్దిన్, మౌర్య గ్రూప్ స్వీట్ మ్యాజిక్ అధినేత ఐఎమ్ఆర్ మోహన్ రావు, రవి దర్బార్ బత్తి అధినేత ఎన్. జగదీషన్ చేతులు మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోహినూర్ గోల్డ్ అండ్ డైమండ్స్ పార్ట్నర్స్ ఎస్. ఎమ్. అక్బర్ మరియు కె మొహిద్దిన్ మాట్లాడుతూ తమ వద్ద గోల్డ్, సిల్వర్, జమ్స్, డైమండ్స్ అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. తమ నూతనవ్యాపార అభివృద్ధికి ప్రజలు సహకరించాలని తెలియజేశారు.

## తాతరాజు మరణం బాధాకరం .. పురోహితులు కృష్ణశర్మ

భీమవరం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




భీమవరం జనసేన నాయకులు మాజీ కౌన్సిలర్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు (తాతరాజు) మరణం బాధాకరమని భీమవరం పురోహితులు యామిజాల కృష్ణ శర్మ, యామిజాల శేషుశర్మ, టి హరి శర్మ, కె రామకృష్ణ అన్నారు. అందరితో ఎంతో ఆప్యాయంగా స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి తాతరాజు అని, అయన భౌతికంగా లేకపోయినా అందరి మధ్యలో ఎప్పటికీ ఉంటారని నివాళిలర్పించారు.

## భీమవరం పట్టణంలోని స్మశానవాటికను స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు కృషి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.





భీమవరం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం పట్టణంలోని స్మశానవాటికను స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని భీమవరం మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గునుపూడి, బలుసుమూడి స్మశాన వాటికల అభివృద్ధి, మహిళల కోసం ప్రత్యేకంగా పింక్ టాయిలెట్ల నిర్మాణాలపై మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భీమవరం పట్టణంలోని గునుపూడి స్మశాన వాటిక అభివృద్ధి పనులను అత్యంత నాణ్యతతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో రూపుదిద్దాలన్నారు. గునుపూడి స్మశాన వాటిక సుమారు 1.9 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీని అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షల మంజూరు చేసి, వివిధ పనులకు టెండర్లు పిలిచి పూర్తి చేయడం జరిగిందని, త్వరలోనే పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. స్మశాన వాటిక అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీ స్థలంలో లాన్ అభివృద్ధి పరచడం, పాత్ వే కు ఇరువైపులా అందమైన మొక్కలను పెంచడం, లాన్ ను నీటితో తడపడానికి స్ప్రింక్లర్లను, పాత్ వే మొక్కలకు డ్రిప్ సిస్టంను అమర్చాలన్నారు. ఈ సందర్భంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ క్రిమినేషన్ కు 6 ప్లాట్ ఫామ్స్ ను గ్యాస్ లేదా విద్యుత్ తో నిర్మాణం, పెద్ద శివుని బొమ్మ, వెయిటింగ్ హాల్, షవర్లు, అస్తికలు భద్రపరిచే గది తదితర పనులు చేపట్టేందుకు అదనంగా సుమారు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టేందుకు ప్రతిపాదనను సిద్ధం చేయడం జరిగిందని, వీటికి సిఎస్ఆర్ ఫండ్స్ నుండి నిధులను కేటాయించవలసిందిగా కోరడం జరిగింది. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్మశాన వాటిక పనులను అత్యంత నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడ రాజీ పడటానికి లేదని తెలిపారు. స్మశాన వాటికలోనికి వెళితే ఆహ్లాదకరమైన పార్కును సందర్శించిన అనుభూతి కలగాలని, ఆ విధంగా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. అలాగే బలుసు మూడి స్మశాన వాటిక మోక్షధామంలోనికి వెళ్లడానికి ఇరుకైన మార్గం ఉండడం ఇబ్బందిగా ఉందని, ఈ విషయమై మోక్షదామం వెళ్లే దారిలోని ఇరువైపులా స్థలాన్ని సర్వే చేయించాలన్నారు. ఇంకా స్థలం అవసరమైతే టీటీడీ నుండి పొందేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.

**భీమవరం పట్టణంలో పింక్ టాయిలెట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి...**

కొత్త బస్టాండ్ ఔట్ గేట్ పక్కన పింక్ టాయిలెట్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి పట్టణంలో మహిళల ప్రత్యేక అవసరాల కోసం పింకు టాయిలెట్ల నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. వీటిని అత్యంత నాణ్యతతో, అందంగా నిర్మించి తీర్చిదిద్దాలని తెలిపారు. తణుకు బస్టాండ్ లో కూడా ఇప్పటికే పింక్ టాయిలెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఏ.అప్పారావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ టి.త్రినాధ రావు, డిఇలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

### పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

ఏలూరు, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వేసవిలో వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్ లో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ముద్రించిన వడదెబ్బ తగిలితే తీసుకోవల్సిన జాగ్రత్తల పోస్టర్ ను కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలనొప్పి, అలసట, ఒళ్లునొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలన్నారు. సూర్య కిరణాలు శరీరంపై పడకుండా చూచుకోవాలని ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగాలని సూచించారు. ఎండల్లో బయట తిరగొద్దని, ఉదయం, సాయంత్రం మాత్రమే అత్యవసర పనులు చేసుకోవాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఇంటికే పరిమితం కావాలన్నారు. వడదెబ్బ తగిలిన వారిని నీడపట్టున చేర్చి దుస్తులను వదులుగా చేసి తడిగుడ్డతో ఒళ్లంతా తుడవాలని సూచించారు. గాలి, వెలుతురు బాగా తగిలేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్.టి.ఆర్. ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డా. రాజీవ్, డిఇఓ యం. వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పిడి పి. శారద, డిసిపివో డా. సూర్యచక్రవేణి, పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత అంబులెన్స్ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం, ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆపదలో సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు సహకారం అందించడం మానవత్వమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో స్వర్గీయ పిప్పళ్ల అచ్యుతం పద్మావతి వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. గ్రామస్తులు, పిప్పళ్ల కుటుంబ సభ్యులు అందించిన సేవలు అద్వితీయమని అన్నారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, సర్పంచ్ శాంతిప్రియ, పిప్పళ్ల రామకృష్ణ, రావుల సురేష్, జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, కోల్లేపర శ్రీను, పిప్పళ్ల రామకృష్ణ, పిప్పళ్ల శ్రీరామ్, రావూరి దానయ్య నాయుడు, మత్స్యపురి గ్రామస్థుల, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## క్యాజువాలిటీలో డాక్టర్ల కొరత, ఆరోగ్య శాఖ మంత్రి తో మాట్లాడి

# సమస్యను పరిష్కరిస్తా : మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రినీ అన్ని విధాల అభివృద్ధి చేసి తీర ప్రాంతంలో ప్రముఖ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి( జి జి హెచ్)లో ఏర్పాటుచేసిన క్లినికల్ లెక్చరు గ్యాలరీని మంత్రివర్యులు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి ప్రారంభించారు.ఆసుపత్రి ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగి తలపురెడ్డి శ్రీనివాసరెడ్డి తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా రోగులకు బల్లలు, స్టేచర్ ట్రాలీలు, మెడిసిన్ ట్రాలీలు మంత్రివర్యులు చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో అతను ఏర్పాటు చేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం మంత్రి ఆవిష్కరించి, ఉద్యానవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రి సానిటరీ వర్కర్ రవితేజ దాతగా మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రివర్యులు ప్రారంభించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా బల్లలు ఆసుపత్రికి అందజేశారు. నైటింగేల్ విగ్రహం, రోగులకు బల్లలు ట్రాలీలు అందజేసిన దాత శ్రీనివాసులు రెడ్డిని ఈ సందర్భంగా మంత్రివర్యులు ఘనంగా సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ వైద్యం అంటేనే సేవ అని ఫ్లోరెన్స్ నైటింగేల్ తన జీవితాన్ని వైద్య సేవలకు అంకితం చేశారని, అనేక మందికి సేవలు చేసి స్ఫూర్తినిచ్చిన మానవతా మూర్తి అని కొనియాడారు. జిల్లా ఆసుపత్రికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని బ్రిటిష్ కాలం నుండి మంచి పేరు పొందిన ఆసుపత్రి అన్నారు. నర్సింగ్ కళాశాల కూడా ఇందులో ఉందని 200 మంది దాకా నర్సింగ్ విద్యార్థులు ఉన్నారని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నర్సింగ్ కళాశాలకు నిధులు సమకూర్చి త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. మొన్న ఆరోగ్య శాఖ కార్యదర్శి తో మాట్లాడానని త్వరలో సమావేశం నిర్వహించి పురోగతిసాధిస్తామన్నారు. ఈ జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉందన్నారు. మరిన్ని నిధులు సమకూర్చి అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరిచి తీర ప్రాంతంలో ప్రముఖ వైద్య కేంద్రంగాతీర్చిదిద్దామన్నారు ప్రస్తుతం క్యాజువాలిటీలో డాక్టర్ల కొరత ఉందని ఆరోగ్య శాఖ మంత్రివర్యులు తో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి ఆశాలత, నర్సింగ్ సూపరింటెండెంట్ డా. ఆశా సజన, ఆర్ ఎం ఓ డాక్టర్ నిరంజన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజా రమణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, కార్పొరేటర్ అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పలువురు నర్సులు, నర్సింగ్ విద్యార్థులు,



# రేపు మోదీ అధ్యక్షతన కీలక భేటీ



ఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుసగా కీలక భేటీలు నిర్వహిస్తోంది. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ బుధవారం సమావేశం కానుంది. దీనికి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహించనున్నారు. ఘటన జరిగిన వెంటనే ఈ కమిటీ ఒకసారి భేటీ అయిన సంగతి తెలిసిందే.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి గత బుధవారం దిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నరమేధానికి పాల్పడిన ముష్కరులను శిక్షించడంతో పాటు వారిని ఎగదోస్తున్న శక్తులనూ బాధ్యులుగా నిలబెడతామంటూ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని వీడే వరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దౌత్య సంబంధాల స్థాయినీ తగ్గించింది. సింధూ జలాల ఒప్పందం అమలును తక్షణమే నిలిపివేసింది.

నిన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది.

# బాధిత కుటుంబానికి భీమా అందజేత..



గోపాలపట్నం ఏప్రిల్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈ ఏడాది ఫిబ్రవరి నెల 6వ తేదీన గోపాలపట్నం ప్రధాన రహదారిలో 89వ వార్డు ఎర్ర చెరువుకు చెందిన ఓమ్మి వెంకట బాలాజీ (25) ప్రమాదవశాత్తు మృతిచెందారు. అతను తెలుగుదేశం పార్టీ సాధారణ సభ్యత్వం తీసుకోవడంతో 5 లక్షల రూపాయలు భీమా మంజూరైంది. ఈ మేరకు బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు గణబాబు మంగళవారం భీమా సొమ్మును చెక్కు రూపంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, తెదేపా ఇన్ ఛార్జ్ రంగనాయకులు, వార్డు అధ్యక్షులు బొడ్డేటి విజయకుమార్, ఇతర నాయకులు దాడి సురేష్, బొడ్డేటి రమేష్, శరగడం రవి, బుడుమూరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## దాయాదికి మరో షాక్.. పాక్ ఎయిర్‌లైన్లకు

# భారత గగనతలం మూసివేత?



ఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్‌పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూదిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

"ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు" అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్‌లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే.

ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతంగా మారనుంది.

ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల మన విమానాలకు పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఎయిర్‌లైన్లు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో ఆర్థికంగా మనకంటే పాక్‌కే ఎక్కువ నష్టం అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. ఇందుకోసం ఓవర్‌ఫ్లైట్ ఫీజు కింద పాక్ రోజుకు 1,20,000 డాలర్లు వసూలుచేసింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని దాయాది నష్టపోవాల్సిందే. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

# కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం..

## 48 టూరిస్టు కేంద్రాల మూసివేత



శ్రీనగర్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈక్రమంలో కశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం దాడి అనంతరం కశ్మీరీ లోయలో స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయినట్లు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండడంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి. ఏప్రిల్ 22న పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో అక్కడినుంచి పర్యాటకులను ప్రత్యేక విమానాల్లో తరలించి.. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం మళ్లీ పర్యాటకులు కశ్మీర్‌కు వస్తున్న నేపథ్యంలో నిఘా వర్గాలు తాజా హెచ్చరికలు చేశాయి.

### ఉగ్రదాడి సీన్ రీక్రియేట్ చేస్తున్న ఎన్ఐఏ..

పహల్గామ్ ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు, సమాచారం అందడంతో వాటి ఆధారంగా.. ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులోభాగంగా ఉగ్రదాడి ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో ఉన్న పర్యాటకులు, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

# కెనడా ఎన్నికల్లో లిబరల్స్‌కే విజయం..

## మరోసారి ప్రధానిగా మార్క్ కార్నీ..!




**టొరంటో: కెనడాలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్తోంది. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీంతో నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.**

ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. లిబరల్ పార్టీ 145 స్థానాల్లో గెలుపొందగా.. మరో 20 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఇక, కన్జర్వేటివ్ పార్టీ 134 స్థానాలు దక్కించుకొని.. మరో 13 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. ఫ్రాంకోయిస్ బ్లాంకెట్ నేతృత్వంలోని బ్లాక్ క్యూబికాయిస్ పార్టీ 22 స్థానాల్లో గెలిచి, మరో స్థానంలో ఆధిక్యంలో ఉంది. ఖలిస్థానీ అనుకూలుడైన జగ్మీత్ సింగ్ ఈ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. ఆయన నేతృత్వంలోని న్యూ డెమోక్రటిక్ పార్టీ నాలుగు స్థానాలు గెలిచి.. మరో 3 చోట్ల ఆధిక్యంలో ఉంది. దీంతో ఆయన పార్టీ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయారు.

కెనడా పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో మొత్తం 343 స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే 172 మంది సభ్యులు అవసరం. అయితే, లిబరల్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోయినప్పటికీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో మిత్రపక్షాలతో కలిసి మార్క్ కార్నీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే కన్జర్వేటివ్ పార్టీ నేత పియరీ పొయిలివ్రా ఓటమిని అంగీకరించారు.

అమెరికాతో సుంకాల యుద్ధం, కెనడా యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలంటూ ట్రంప్ బెదిరింపుల వేళ ఈ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అటు భారత్‌తోనూ కెనడాకు దౌత్య విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో లిబరల్ పార్టీ సభ్యులు తదుపరి ప్రధానిగా మార్క్ కార్నీని ఎన్నుకున్నారు. ప్రధాని బాధ్యతలు చేపట్టిన కార్నీ.. ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. కెనడా కాలమానం ప్రకారం ఏప్రిల్ 28న పోలింగ్ జరగగా.. ఆ వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రస్తుతం ఫలితాలు వెలువడుతున్నాయి.

# వైమానిక దాడుల భయం..

## రాడార్ వ్యవస్థలను తరలిస్తున్న పాక్!



పహల్గాం : పహల్గాం ఉగ్రదాడితో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. అలాగే తమపై భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతోన్న పాకిస్థాన్ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దాంతో నియంత్రణ రేఖ వెంబడి పాక్ బలగాలు అప్రమత్తమవుతున్నాయి. భారత వైమానిక దాడులను పసిగట్టడానికి సియాల్‌కోట్ ప్రాంతానికి పాకిస్థాన్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58కి.మీ. దూరంలో ఉన్న ఖోర్ కంటోన్‌మెంట్ వద్ద టీపీఎస్-77 రాడార్ సైట్‌ను ఏర్పాటుచేసింది. టీపీఎస్-77 మల్టీ-రోల్ రాడార్ అనేది అత్యంత సామర్థ్యం గల రాడార్ వ్యవస్థ. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులను గమనించేందుకు, ఎయిర్ ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం ఉపయోగిస్తారు. గతవారం భారత్ రఫేల్ సహా ఫ్రంట్‌లైన్ ఫైటర్ జెట్లు పెద్దఎత్తున సైనిక విన్యాసంలో పాల్గొన్నాయి. మరోవైపు మన నౌకాదళం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది.

పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనికి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో గుబులుగా ఉన్న ఆ దేశం.. పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.

పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ ప్రతీకార దాడి చేపడుతుందని, త్వరలోనే ఇది జరిగే అవకాశం ఉందని పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "ఇప్పుడు అది (ప్రతీకార దాడి) జరగనున్న విషయం కాబట్టి.. మా బలగాలను అప్రమత్తం చేశాం. దాడులు జరిగే పరిస్థితుల్లో కొన్ని వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆ మేరకు చర్యలు తీసుకున్నాం" అని మంత్రి ఖవాజా ఆసిఫ్ ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే, తన అంచనాలకు దారితీసిన వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

SPORTS NEWS

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 30,
బుధవారం 2025



# సంజు శాంసన్‌కు ఏమైంది? ఇదే ఆఖరి సీజనా?

**సంజు శాంసన్.. ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ టీమ్ ఇండియాలో ఇప్పటిదాకా సుస్థిర స్థానం సంపాదించలేకపోయిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజు. భారత జట్టులో అతడికి సరిపడా అవకాశాలివ్వలేదనే చర్చ ఎప్పుడూ ఉండేదే. ఐతే ఐపీఎల్‌లో సంజు ప్రతిసారీ మెరుపులు మెరిపిస్తుం టాడు. కానీ ఈ సీజన్‌లో అతడి మెరుపులు కరవయ్యాయి. సంజు మ్యాచ్ ఆడడమే గగనంగా మారింది. ఓవైపు గాయాలతో సతమతం అవుతూ.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్‌లో ఇమడలేక అతను ఆ జట్టు నుంచి దూరం జరగడానికి ప్రయత్నిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది.**



సోమవారం గుజరాత్‌తో మ్యాచ్ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ డగౌట్‌లో సంబరాలు మామూలుగా లేవు. వరుసగా అయిదు ఓటముల తర్వాత ఆ జట్టుకు ఓ విజయం అందించిన మ్యాచ్ ఇది. 14 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో సంచలన బ్యాటింగ్‌తో.. 35 బంతుల్లోనే శతకం సాధించాడు. అతడి శతకం పూర్తయినపుడు స్టేడియంలోని ప్రేక్షకులంతా స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఈ సీజన్ ముంగిట ఏదో మ్యాచ్ ఆడుతూ గాయపడి వీల్ ఛైర్‌కు పరిమితమైన రాహుల్ ద్రవిడ్ సైతం.. ఉత్సాహంలో లేచి నిలబడి వైభవ్‌ను అభినందించాడు.

కానీ ఆ సమయంలో సంజు శాంసన్‌లో పెద్దగా స్పందనా లేదు. కూర్చుని మొక్కుబడిగా చప్పట్లు చరుస్తూ కనిపించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. జట్టంతా అంత సంతోషంలో ఉంటే.. తనకేం సంబంధం లేదన్నట్లు సంజు ఇలా అన్యమనస్కంగా కనిపించడం ఆశ్చర్యానికి గురి చేసింది. సంజు ఈ సీజన్లో ఇలా వింతగా ప్రవర్తించడం తొలిసారేమీ కాదు. దిల్లీ క్యాపిటల్స్‌తో సూపర్ ఓవర్‌కు దారి తీసిన మ్యాచ్‌లో సంజు ప్రవర్తన మరింత ఆశ్చర్యపరిచింది.

సూపర్ ఓవర్ మొదలవుతుండగా.. రాజస్థాన్ ఆటగాళ్లంతా గుమిగూడి కోచ్ రాహుల్ ద్రవిడ్ చెబుతున్న మాటలు వింటూ కనిపించారు. అది సూపర్ ఓవర్ ప్లానింగ్‌లో భాగం కావచ్చు. ఐతే జట్టంతా అక్కడ ఉంటే.. సంజు మాత్రం విడిగా నడుస్తూ కనిపించాడు. జట్టు సహచరుల్లో ఒకరు గ్రూప్‌లోకి రమ్మని పిలుస్తున్నా.. వద్దు అన్నట్లు సైగ చేసి దూరంగానే ఉండిపోయాడు సంజు. దీంతో కోచ్ ద్రవిడ్‌తో, మేనేజ్‌మెంట్‌తో సంజుకు విభేదాలు నెలకొన్నట్లు అప్పుడు గట్టి ప్రచారమే జరిగింది. గుజరాత్‌తో మ్యాచ్‌లో సంజు ప్రవర్తనతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది?

### వచ్చే సీజన్‌కు ఉండడా?

2013లో సంజు ఐపీఎల్ కెరీర్ ఆరంభమైంది రాజస్థాన్ జట్టుతోనే. 2016, 2017లో రాజస్థాన్ నిషేధానికి గురైన రెండేళ్లు మినహా ఆ జట్టుతోనే అతను సాగుతున్నాడు. 2021లో అతను రాయల్స్ కెప్టెన్ అయ్యాడు. అతడి నాయకత్వంలో జట్టు ప్రదర్శన మెరుగుపడింది. సంజు కూడా నిలకడగానే రాణిస్తున్నాడు. ఐతే ఈ సీజన్లో మాత్రం రాజస్థాన్ ప్రదర్శన దెబ్బ తింది. టీమ్ మేనేజ్మెంట్‌తో సంజుకు చెడిందనే వార్తలు వస్తున్నాయి.

ఒకప్పుడు రాజస్థాన్ మెంటార్‌గా ఉండి ఆ తర్వాత భారత జూనియర్, సీనియర్ జట్ల కోచ్ బాధ్యతలతో చాలా ఏళ్లు రాయల్స్‌కు దూరమైన ద్రవిడ్.. టీమ్ ఇండియా కోచ్ పదవీకాలం ముగియడంతో ఈ సీజన్‌కు తిరిగి రాజస్థాన్ జట్టులోకి వచ్చాడు. కోచ్ అయ్యాడు. ద్రవిడ్‌తో ఎందుకో సంజుకు పొసగట్లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా రాజస్థాన్ జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న జోస్ బట్లర్‌ను అట్టిపెట్టుకోకపోవడం ఆ జట్టు అభిమానులకు పెద్ద షాక్. కొందరేమో సంజు అభీష్టానికి వ్యతిరేకంగా అతణ్ని టీమ్ మేనేజ్మెంట్ వదిలేసిందని అంటుంటే.. కొందరేమో ఈ నిర్ణయంలో సంజుదే కీలక పాత్ర అంటున్నారు.

తాను ఓపెనర్‌గా మారడం కోసమే బట్లర్‌ను సంజు సాగనంపేశాడని, ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ ఆ స్థానానికి ఎసరుపెడుతుండడంతో తట్టుకోలేకపోతున్నాడని రకరకాల ఊహాగానాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సంజు గాయాల విషయంలో రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందు వేలి గాయంతో కొన్ని మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే ఆడాడు. ఆ తర్వాత ఎన్‌సీఏ నుంచి క్లియరెన్స్ తెచ్చుకుని పూర్తి స్థాయిలో ఆడుతూ జట్టు సారథ్య బాధ్యతలు అందుకున్నాడు.

కానీ దిల్లీతో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా పక్కటెముకలు పట్టేయడంతో మైదానాన్ని వీడిన అతను.. ఆ తర్వాత తిరిగి మ్యాచ్ ఆడలేదు. బ్యాటింగ్ చేస్తూ పక్కటెముకలు పట్టేస్తే నాలుగు మ్యాచ్‌లు దూరంగా ఉండడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గాయం పేరుతో అతణ్ని రాయల్స్ కావాలనే పక్కన పెట్టిందని కొందరంటుంటే.. సంజునే కావాలని మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడని మరికొందరంటున్నారు. ఏదేమైనప్పటికీ.. ఈ సీజన్లో సంజు పేరు ప్రతికూల విషయాలతోనే వార్తల్లో నిలుస్తోంది. రాయల్స్‌తో అతడికి చెడిందని, వచ్చే సీజన్‌కు అతను జట్టు మారడం ఖాయమని, చెన్నై సూపర్ కింగ్స్‌లోకి అతను వెళ్తే ఆశ్చర్యం లేదని అంటున్నారు. మరి ఏమవుతుందో చూడాలి.

# కార్గిల్‌లో ఓడించాం.. మర్చిపోయారా?:

## అఫ్రిదీకి ధావన్ స్ట్రాంగ్ కౌంటర్





**జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల వేళ భారత సైన్యాన్ని ఉద్దేశిస్తూ పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనికి భారత క్రికెటర్ శిఖర్ ధావన్ తీవ్రంగా స్పందించాడు. ఇంకెంతగా దిగజారుతారంటూ దాయాది ఆటగాడికి గట్టి కౌంటర్ ఇచ్చాడు.**

"మేం మీ దేశాన్ని కార్గిల్ యుద్ధంలో ఓడించాం. అది మర్చిపోయారా? ఇప్పటికే మీరు దారుణంగా పతనమయ్యారు. ఇంకా ఎంతకు దిగజారుతారు? ఇలాంటి చెత్త వ్యాఖ్యలు చేయడం మాని.. మీ దేశ పరిస్థితిని మెరుగుపర్చుకోవడంపై దృష్టిపెట్టండి. భారత సైన్యంపై మేమంతా గర్వపడుతున్నాం" అని ధావన్ 'ఎక్స్' వేదికగా అఫ్రిదీపై మండిపడ్డాడు.

'ఉగ్రవాదాన్ని పోషిస్తున్నామని మీ మంత్రే చెప్పారుగా..': ఐరాసలో పాక్‌ను ఎండగట్టిన భారత్

ఇటీవల పహల్గాం ఉగ్రదాడిపై అఫ్రిదీ మాట్లాడుతూ.. భారత సైన్యాన్ని కించపర్చేలా వ్యాఖ్యానించాడు. "ఈ దాడిని వారి సైన్యం ఎందుకు అడ్డుకోలేకపోయింది?" అంటూ అనుచిత పదజాలంతో భారత్‌పై అక్కసు వెళ్లగక్కాడు. అఫ్రిదీ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పహల్గాం దాడికి పాక్ సీమాంతర ఉగ్రవాదమే కారణమన్న భారత్.. దాయాదితో దౌత్య సంబంధాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి పాక్ మంత్రులు, నేతలతో పాటు అక్కడి మీడియా కూడా మనపై అక్కసు వెళ్లగక్కుతోంది. భారత సైన్యానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే పాక్‌కు చెందిన పలు యూట్యూబ్ ఛానళ్లపై కేంద్రం నిషేధం విధించింది.

# ఐపీఎల్ మ్యాచ్ వీక్షిస్తున్న ఆరేళ్ల వైభవ్ ఫొటో వైరల్

**14 ఏళ్ల 32 రోజుల వయసులో ఐపీఎల్‌లో సెంచరీ బాది వైభవ్ సూర్యవంశీ సంచలనం సృష్టించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సోమవారం రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన సూర్యవంశీ తన అద్భుత ఇన్నింగ్స్‌తో గుజరాత్ టైటాన్స్‌ను మట్టి కరిపించాడు. అయితే ఈ బాల బ్యాటర్‌కు సంబంధించిన చిన్ననాటి ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వైభవ్ సూర్యవంశీ తనకు సుమారు ఆరేళ్ల వయసున్నప్పుడు అప్పటి ఐపీఎల్ టీముల్లో ఒకటైన రైజింగ్ పుణె సూపర్ జెయింట్‌కు మద్దతు తెలుపుతూ ఆ ఫొటోలో కన్పించాడు. ఆ చిత్రాన్ని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నాడు.**



'గత రాత్రి నేను అతడి ఇన్నింగ్స్‌ను సంభ్రమాశ్చర్యాలతో వీక్షించాను. ఈ ఉదయం 6 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 2017లో అప్పటి జట్టు రైజింగ్ పుణె సూపర్‌జెయింట్‌ను ఉత్సాహ పరుస్తున్న ఫోటోను చూశాను. ధన్యవాదాలు, వైభవ్. నీకు నా మద్దతు, శుభాకాంక్షలు' అని గోయెంకా ఆ ఫొటోకు క్యాప్షన్ రాశాడు. వైభవ్ సూర్యవంశీ తాను ఆడిన మూడో ఐపీఎల్ మ్యాచ్‌లోనే పలు రికార్డులు కొల్లగొట్టాడు. అతి పిన్న వయసులోనే ఐపీఎల్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే ఐపీఎల్‌లో అత్యంత వేగంగా శతకం బాదిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా సెకండ్ ఫాస్టెస్ట్ సెంచరీ వీరుడిగా అవతరించాడు. వైభవ్ 35 బంతుల్లో ఈ ఫీట్‌ను సాధిస్తే... క్రిస్‌గేల్ 2013లో 30 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ప్రస్తుతానికి ఇదే ఐపీఎల్‌లో అత్యంత వేగమైన సెంచరీ. తర్వాత మన వైభవ్‌దే రెండో అత్యంత వేగవంతమైన శతకం.

# జనం అది మరిచిపోతున్నారు



**టీ20 క్రికెట్లో భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని జనం మరిచిపోతున్నారని విరాట్ కోహ్లి అన్నాడు. ఆదివారం దిల్లీపై అర్ధశతకం సాధించిన అతడు ఆర్సీబీ విజయంలో తన వంతు పాత్రను పోషించిన సంగతి తెలిసిందే. అయితే మందకొడి పిచ్‌పై అతడు ధాటిగా బ్యాటింగ్ చేయలేదు. చెలరేగి ఆడిన కృనాల్ పాండ్యకు సహకరించాడు. ఈ మ్యాచ్ గురించి కోహ్లి మాట్లాడుతూ.. "ఈ పిచ్‌పై మాది చక్కని విజయం. ఇంతకుముందు మ్యాచ్‌ల కంటే ఈ మ్యాచ్‌లో పిచ్ భిన్నంగా స్పందించింది. ఛేదనలో ఎప్పుడూ కూడా నేను.. లక్ష్యం దిశగా సాఫీగా సాగుతున్నామా అని డగౌట్‌లో ఉన్న వారిని అడుగుతుంటా. లక్ష్యం, పరిస్థితులు, రాబోయే బౌలర్లు ఎవరు అన్న దాన్ని దృష్టిలో పెట్టుకుని ఆడతా. సింగిల్స్, డబుల్స్ ఆగకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా. భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని జనం మరిచిపోతున్నారు" అని అన్నాడు.**

# అప్పుడు సచిన్‌కు 17.. ఇప్పుడు వైభవ్‌కు 14 ఏళ్లే: ఇయాన్ బిషప్

**వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే ఒకప్పుడు సచిన్ ఆటతీరు గుర్తుకొస్తుందని.. వైభవ్ చిన్నవయసులోనే సంచలనాలు నమోదు చేశాడని విండీస్ క్రికెట్ దిగ్గజం ఇయాన్ బిషప్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు. అతిపిన్నవయస్సులోనే శతకం బాదడం విశేషం. సచిన్ కూడా చిన్నవయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. 1990ల్లో జరిగిన పలు మ్యాచుల్లో భారత్ గెలవడంలో సచిన్ కీలక పాత్ర పోషించాడని ఇయాన్ గుర్తు చేసుకున్నాడు. అప్పుడు సచిన్‌కు 17 ఏళ్లేనని.. కానీ, ఇప్పుడు వైభవ్‌కు 14 సంవత్సరాలేనని బిషప్ పేర్కొన్నాడు.**



"నేను కౌంటీ క్రికెట్‌లో డెర్బీషైర్‌కు ప్రాతినిధ్యం వహించా. భారత్‌పై ఆడా. ఇప్పటికీ నాకు ఆ మ్యాచ్ గుర్తుంది. తొలుత మేం బ్యాటింగ్ చేశాం. మంచి లక్ష్యమే నిర్దేశించాం. బౌన్సీ పిచ్ కావడంతో తేలికగా విజయం సాధిస్తామని అనుకున్నాం. అందుకు తగినట్టుగానే వికెట్లూ పడగొట్టాం. కానీ, ఓ కుర్రాడు (సచిన్) క్రీజ్‌లోకి వచ్చాడు. కొన్ని బంతులను ఎదుర్కొన్నాక.. త్వరగా పెవిలియన్‌కు చేరుస్తామని భావించా. అయితే, ఓ బంతిని పొరపాటున సరైన లెంగ్త్‌లో కాకుండా కాస్త గతి తప్పింది. దానిని మైదానం వెలుపల ఉన్న చెట్టుకు తగిలేలా బాదాడు. ఆ 17 ఏళ్ల కుర్రాడు నన్ను షాక్‌కు గురి చేశాడు. గొప్పగా ఉండే నా కళ్లు తెరిపించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో వైభవ్ 14 ఏళ్ల కుర్రాడే. ప్రపంచస్థాయి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ సహా ఇతర బౌలర్లు తప్పకుండా షాక్‌కు గురై ఉంటారు" అని ఇయాన్ బిషప్ వ్యాఖ్యానించాడు. 1990ల్లో మహ్మద్ అజహరుద్దీన్ నాయకత్వంలోని టీమ్ఇండియా డెర్బీషైర్ జట్టుతో టూర్ మ్యాచ్ ఆడింది. ఛెస్టర్‌ఫీల్డ్ మైదానం బౌన్స్‌కు మారుపేరు. అలాంటి పిచ్‌పై భారత్‌కు 234 పరుగుల లక్ష్యం ఎదురైంది. సచిన్ ఎదురుదాడి చేయకుండా ఉన్నంత వరకూ ఆతిథ్య జట్టే గెలుస్తుందని తాము భావించినట్లు బిషప్ తెలిపాడు. విండీస్‌కు చెందిన ఈ మాజీ పేసర్ కౌంటీ క్రికెట్ ఆడాడు. తాను వేసిన లెంగ్త్ బంతిని మిడ్‌వికెట్ మీదుగా సిక్స్ కొట్టడం తనను షాక్‌కు గురి చేసిందని తెలిపాడు. జట్టులోని మిగతా బ్యాటర్లు ఎవరూ 35 కంటే ఎక్కువ పరుగులు చేయలేదని.. సచిన్ మాత్రం అజేయంగా 105 పరుగులు చేయడంతో భారత్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



## మూడో బిడ్డతో శ్రీలీల

ఇప్పటికే ఇద్దరు పిల్లలకు తల్లిలా ఆలనా పాలన చూసుకుంటూ ఉన్న శ్రీలీల మరో పాపను తన ఇంటికి తీసుకు వచ్చినట్లు చెప్పుకొచ్చింది. %హీరోయిన్ శ్రీలీల వయసు చిన్నదే కానీ ఆమె ఆలోచన విధానం చాలా పెద్దది. నిండా పాతికేళ్లు లేని ఈ హీరోయిన్ ఎంతో మంది హీరోలు, హీరోయిన్స్ చేయలేని పనిని చేస్తూ తన మంచి మనసు చాటుకుంటుంది. సాధారనంగా అనాధలకు సహాయంగా నిలిచేందుకే పలువురు సెలబ్రిటీలు ఆసక్తి చూపించరు. అలాంటిది శ్రీలీల ఏకంగా ఇద్దరు వికలాంగులు అయిన పిల్లలను దత్తత తీసుకుని వారి ఆలనా పాలన చూస్తూ, తాను కూడా సమయం దొరికినప్పుడు వారితో ఆడుకుంటూ కనిపిస్తూ ఉంటుంది. శ్రీలీల ఇద్దరు పిల్లలను ఎంతో అల్లారు ముద్దుగా చూసుకుంటూ వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తూ ఉంటుంది. శ్రీలీల మంచితనం గురించి ఎంత చెప్పినా తక్కువే అంటూ ఆమె అభిమానులు అంటూ ఉంటారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలకు తల్లిలా ఆలనా పాలన చూసుకుంటూ ఉన్న శ్రీలీల మరో పాపను తన ఇంటికి తీసుకు వచ్చినట్లు చెప్పుకొచ్చింది. ఒక చిన్నారికి ముద్దు పెడుతూ ఉన్న ఫోటోను శ్రీలీల షేర్ చేసింది. ఆ ఫోటోతో పాటు... ఇంటికి మరొకరు, హృదయాలను నింపేందుకు ఈ పాప వచ్చింది అన్నట్లుగా కామెంట్ పెట్టింది. ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్న శ్రీలీల మరో పాపను దత్తత తీసుకోవడం అనేది చాలా గొప్ప విషయం. ఆమె యొక్క మంచితనం ముందు ఇతర స్టార్ హీరోలు, హీరోయిన్స్ బలాదూర్ అంటూ కామెంట్ చేస్తున్నారు. ముందు ముందు ఈమె మరింత మందికి సహాయం గా నిలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందమైన రూపం ఉన్నవారికి అందమైన మనసు ఉండదని కొందరు అంటూ ఉంటారు. కానీ శ్రీలీల మాత్రం అందంగా ఉండటంతో పాటు అంత మంచి మనసు కలిగి ఉన్నది అనడంలో సందేహం లేదు. నటిగా ఎంత బిజీగా ఉన్నా ఆ పిల్లలతో సరదాగా సమయంను గడిపేందుకు శ్రీలీల సమయం కేటాయిస్తూ ఉంటుంది. పుష్ప 2 సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో దక్కిన గుర్తింపు కారణంగా హిందీలో ఒక సినిమాను ఈమె చేసే అవకాశం దక్కించుకుంది. త్వరలోనే ఈమె మరో భారీ తెలుగు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. తెలుగులోనే కాకుండా తమిళ్, హిందీ సినిమాల్లోనూ ఈమె బిజీ బిజీగా సినిమాలు చేస్తూ వస్తోంది. కన్నడ సినిమాలతో చిన్న వయసులోనే సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన శ్రీలీల తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. తెలుగు సినిమా పెళ్లి సందడితో టాలీవుడ్‌లో పరిచయం అయింది. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచినా తన అందంతో పాటు తన డాన్స్‌తో ప్రేక్షకులను మెప్పించింది. ఫిల్మ్ మేకర్స్‌కి ఈమె తెగ నచ్చడంతో తమ సినిమాల్లో వరుసగా ఆఫర్లు ఇస్తున్నారు. ఈమెకు టాలీవుడ్‌లో ధమాకాతో మొదటి విజయం దక్కింది. ఆ తర్వాత నుంచి ఏడాదికి మూడు నాలుగు సినిమాల చొప్పున ఆఫర్లు వస్తున్నాయి. రవితేజతో కలిసి ధమాకా తర్వాత మరో సినిమాను చేస్తోంది. ఇంకా పలు తెలుగు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో మరో రెండు మూడు సినిమాలతో శ్రీలీల ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



## కాజోల్ నటవారసురాలిని చూశారా?

ఐదేళ్ల క్రితం నైసా వేరు.. ఇప్పటి నైసా వేరు! ఇంత నైసుగా ఎలా మారిందో కానీ, ఇటీవల నటవారసురాలి ఫోటోషూట్ల దూకుడు అమాంతం పెరిగింది. ప్రతి ఈవెంట్లోను తల్లి కాజోల్ తో పోటీపడి ఫోటోగ్రాఫర్స్ కి ఫోజులిస్తోంది. మమ్మీని మించి నైసా నైసుగా దర్శనమిస్తోంది. తనతో కలిసి ఈవెంట్లలో బోలెడంత సందడి చేస్తోంది. అది పెళ్లి వేడుక లేదా సినిమా ఈవెంట్, లేదా ఇంకేదైనా కానీ కాజోల్ తో పాటు నైసా దేవగన్ కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే నైసా దేవగన్ గ్లామరస్ వేషధారణలు వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. నేటి జెన్ జెడ్ నటవారసురాళ్లతో పోటీపడుతూ ఈ బ్యూటీ అందాలను ఆరబోస్తోంది. తాజాగా నైసా దేవగన్ కొత్త అవతారంలో కనిపించింది. పదహారణాల దేశీ గాళ్ లా పట్టు పరికిణీలో గుబులు రేపింది. ఎరుపు, గోల్డ్ మిశ్రమ రంగు పరికిణీ దానికి కాంబినేషన్ గా బిస్కెట్ కలర్ టాప్ ధరించి మెడలో కాంబినేషన్ వజ్రాల హారం ధరించి నైసా ధగధగా మెరిసిపోతోంది. 22 ఏళ్ల నైసా అందచందాలు మైమరిపిస్తున్నాయి. ఈ లుక్ చూడగానే నైసా నైసుగుందమ్మా! అంటూ అభిమానులు తన అందాన్ని పొగిడేస్తున్నారు. ఇదే హుషారులో నైసా సినీ ఎంట్రీ ఇస్తుందని ఊహిస్తున్నారు. ఇప్పటి వరకూ కాజోల్- అజయ్ దేవగన్ తమ కుమార్తె సినీఎంట్రీ గురించి ఎలాంటి హింటూ ఇవ్వలేదు. ఇటీవల నైసా దేవగన్ తన తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ నటిగా మారాలని కోరుకోవడం లేదని కాజోల్ వెల్లడించడం నిరాశ కలిగించింది. ప్రస్తుతానికి నైసా స్టడీస్ పైనే దృష్టి సారిస్తోందని సమాచారం.

## అభిమానులను ఓ మాదిరిగా అలరించే '28 డిగ్రీస్ సెల్సియస్'

**అరుదైన కాన్సెప్ట్‌కి విఫలమైన టేకింగ్ %-% '28 డిగ్రీస్ సెల్సియస్' సినిమా సమీక్ష**

కరోనా మహమ్మారి కంటే ముందే విడుదల కావాల్సిన ఈ సినిమా, అనేక కారణాల వలన వాయిదా పడుతూ వచ్చింది. చివరకు థియేటర్లలో పెద్దగా హడావుడి లేకుండా విడుదలైన ఈ చిత్రం, ఒక నెల గడవకముందే అమెజాన్ ప్రైమ్‌లోకి అడుగుపెట్టింది. మొదట్లోనే చెప్పుకోవాల్సింది ఏమిటంటే, ఇదొక ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్న హారర్ థ్రిల్లర్. కానీ కథనంలో ఉన్న బలహీనతలు, స్క్రీన్ ప్లే లో లోపాలు ఈ సినిమాను నిరుత్సాహానికి గురిచేశాయి. కథ విషయానికి వస్తే, కార్తీక్ (నవీన్ చంద్ర) మరియు అంజలి (షాలిని) మెడికల్ కాలేజ్ స్టూడెంట్లు. వారి పరిచయం ప్రేమగా మారి చివరకు పెళ్లికి దారి తీస్తుంది. కానీ అంజలి ఆరోగ్య పరమైన అరుదైన సమస్యతో బాధపడుతుంది. ఆమె శరీర ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌కి తగ్గితే ప్రాణాపాయం. అయినా కార్తీక్ ఆమెను ప్రేమతో వివాహం చేసుకుంటాడు. మెరుగైన చికిత్స కోసం అమెరికాలోని జార్జియాకు వెళతారు. అక్కడ ఒక ఇంట్లో అద్దెకు దిగితే కథ మరింత మలుపులు తిరుగుతుంది. పక్కింటి అమ్మాయి గీతతో అంజలి స్నేహం, కార్తీక్ కు సమీరాతో పరిచయం.. మధ్యలో అజ్ఞాతమైన సంఘటనలు జరగడం కథకు థ్రిల్లింగ్ టర్న్ ఇస్తాయి.


**హాస్పిటల్ హావభావాలు %-% ప్రేక్షకుడి నరాలు నొక్కినటుగా**

సినిమాలో హాస్పిటల్ నేపథ్యం ఎక్కువగా ఉండటం ఓ మైనస్ పాయింట్. ఎందుకంటే, సాధారణ ప్రేక్షకుడు హాస్పిటల్ వాతావరణాన్ని చూసి అసౌకర్యంగా ఫీల్ అవుతాడు. స్కానింగ్‌లు, స్ట్రెచర్లు, ఆపరేషన్ రూమ్స్ వంటి విజువల్స్ ఎక్కువగా రావడం వలన కథ వేరే ట్రాక్ లోకి వెళ్లిపోయిన అనుభూతి కలుగుతుంది. తొలి అర్ధ భాగం అంతా కథకు ఒక స్థిరమైన ఆధారం ఉండకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రేమ, బాధ, బాధ్యతలు అన్నీ కలిసిన కథ అయినా.. ప్రేక్షకుడిలో ఆ అనుభూతులు అనుకున్న స్థాయిలో బలపడవు.

**సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్ %-% ఓ మోస్తరుగా మాత్రమే**

సెకండాఫ్‌లో దర్శకుడు హారర్ మరియు సస్పెన్స్ కలయికతో సినిమాను ఆసక్తికరంగా మలచాలని ప్రయత్నించాడు. అయితే ఈ యత్నం చాలచోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయింది. కామెడీ కోసం వైవా హర్ష, ప్రియదర్శిని లాంటి ఆర్టిస్టులను తీసుకున్నా సరే, వారి పాత్రలకు సరైన స్కోప్ లేకపోవడంతో హాస్యం నిలదొక్కుకోలేదు. చివర్లో వచ్చే ట్విస్ట్ ఓ మోస్తరుగా ఆకట్టుకుంటుంది కానీ, అప్పటికే కథ నెమ్మదిగా సాగిపోతుండడం వల్ల ఆ ఉత్కంఠ తగ్గిపోతుంది. ప్రేక్షకుడు "ఇంకా ఏం జరగబోతుందా?" అనే ఉత్కంఠతో కాకుండా, "ఎప్పుడిది అయిపోతుందా?" అనే భావనతో చూస్తాడు.

**టెక్నికల్ అంశాలు %-% ఎంతగానో మెరుగుపడాలి**




కొన్ని విజువల్స్ నిజంగా హారర్ జానర్‌కు తగ్గట్టే ఉన్నాయనిపిస్తుంది. శ్రావణ్ భరద్వాజ్ సంగీతం మరియు శ్రీ చరణ్ పాకాల బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఓ మోస్తరుగా సాగుతుంది. ఎడిటింగ్ విభాగం గ్యారీ బీహెచ్ చక్కగా నిర్వహించినప్పటికీ, కథన నిర్మాణంలో సహకరించలేకపోయింది. హీరో నవీన్ చంద్ర, హీరోయిన్ షాలిని సహా నటీనటులందరూ తాము పొందిన పాత్రల్లో న్యాయం చేసినప్పటికీ, ఆ పాత్రల రచన బలహీనంగా ఉండడంతో వారి అభినయం ఆవిష్కృతం కావడంలో కొద్దిగా కొదవ కనిపిస్తుంది.

## పెహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన హీరో అజిత్



న్యూఢిల్లీ : పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రముఖ కోలీవుడ్ హీరో అజిత్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో మృతులకు తన సంతాపం తెలిపారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం (ఏప్రిల్ 28) ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో అజిత్ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. పెహల్‌గామ్ ఉగ్రదాడిని ఖండించారు. ప్రజలంతా ఒకరినొకరు గౌరవించుకోవాలని, కుల మతాలకతీతంగా ఐకమత్యంతో ఉండాలని ఆయన కోరారు. పెహల్గామ్ వంటి ఘటనలు దేశంలో మరోసారి జరగకూడదని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ అవార్డుల కార్యక్రమంలోనే ఆయన సాయుధ దళాలను కలిశారు. వారి త్యాగాలను ఆయనెంతో మెచ్చుకున్నారు. వారందరి కారణంగానే మనం ప్రశాంతంగా నిద్ర పోగలుగుతున్నాం అని అజిత్ చెప్పుకొచ్చారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339